# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 10 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని మరో ఏడాది పొడిగింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రో రైలు ఎండీగా ఎన్వీఎస్ రెడ్డిని ప్రభుత్వం తిరిగి నియమించింది. ఇదివరకు పనిచేసిన స్థానాల్లోనే ఆయన్ను రీఅపాయింట్ చేస్తూ.. బుధవారం తెలంగాణ గవర్నమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 ఏప్రిల్ ఒకటి వరకు ఆయన పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు కీలక దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంతకాలం హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్), హైదరాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీగా కీలకంగా వ్యవహరించిన ఎన్వీఎస్ రెడ్డి సేవలను మరికొంత కాలం కొనసాగించడం సముచితం అని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మరో ఏడాది పాటు ఎన్వీఎస్ రెడ్డిని హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఏఎంఎల్ ఎండీగా కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం మెట్రో సెకండ్ ఫేజ్‌ను కీలకంగా భావిస్తోంది. ఓల్డ్ సిటీ, ఎయిర్ పోర్టు, ఫోర్త్ సిటీ, నార్త్ సిటీ వంటి ప్రాంతాలకు కూడా మెట్రో నడిపేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్ట్ -ఏ కింద 5 కారిడార్లు, పార్ట్ -బీ కింద 3 కారిడార్లను ప్రతిపాదించగా.. ఇందులో పార్ట్-ఏలోని 5 కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను 5 నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.

# తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయం

- మోడీకి వ్యతిరేకంగా పోరాడాలి
- గాడ్సే ఆలోచనల్ని మోడీ విస్తరింపజేస్తు న్నారు
- గాంధేయవాదులు రాహుల్‌కు అండగా నిలవాలి
- తెలంగాణలో కులగణన చేసి చూపించాం
- ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి
- సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

'తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయబోమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులు బ్రిటీష్ వాళ్ల కన్నా ప్రమాదకరమని.. వారిని బ్రిటీశ్ వారు తరిమికొట్టినట్టే దేశం నుంచి తరిమికొట్టాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున సమావేశమైనట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గాడ్సే ఆలోచన విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబసభ్యులు, రాహుల్ గాంధీ గారి మిత్రులు, దేశ నలుమూలల ఉన్న ప్రతి ఒక్కరూ మోదీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 'మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారు. వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేశారు. దేశ మూలల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోదీ చేశారు' అని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. 'కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై వాగ్దానాలు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు చాలా హామీలు ఇచ్చారు' అని వివరించారు. రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'మేం తెలంగాణలో కుల గణన చేసి చూపించాం. కుల గణనపై రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడతారనే భయంతో ఆయనకు లోక్‌సభలో మోదీ మైక్ ఇవ్వలేదు' అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ ఆదేశం మేరకు ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 'మోదీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని యేటా 2 కోట్ల యువకులకు ఉద్యోగాలు రాలేదని తెలిపారు. గాంధీ ఆలోచనతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను.. మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు.

'తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం. గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా. మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో వల్లభాయ్ పటేల్ వారసులతో మా ప్రజలకు సంబంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇచ్చారు తెలంగాణను సోనియా గాంధీ అందించింది' అని రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏండ్లు అనేక పోరాటాలు చేశారనీ, కానీ బ్రిటిషర్లు ఏనాడూ ఆయనపై లాఠీ ప్రయోగం చేయలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారని చెప్పారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు తామంగా సిద్ధంగా ఉన్నామనీ, సీడబ్ల్యూసీ చింతన బైఠక్ నుంచి అదే ఆశ, ఆదేశాలతో తిరిగి వెళ్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ట్రంప్ మరో బాంబ్...

- అతి త్వరలో ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు..
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు అధ్యక్షుడు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్లు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. అమెరికాలో ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని వ్యాఖ్యానించారు. కాగా, ఏప్రిల్ 2న భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, వీటిలో ఔషధ ఉత్పత్తులకు తాత్కాలికంగా మినహాయింపు లభించింది. ఇప్పుడు వాటిపై కూడా త్వరలోనే సుంకాలు విధించనున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు.

అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వచ్చినవే. సిప్లా, లుపిన్, సన్ ఫార్మా వంటి సంస్థలతో పోల్చితే జనరిక్ ఔషధాలను భారీగా ఉత్పత్తి చేస్తున్న జైడస్, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ తదితర కంపెనీలపైనే అమెరికా టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఫార్మా కంపెనీలు.. అమెరికా మార్కెట్ నుంచి ఐరోపా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల వైపునకు వెళ్లడమే ఉత్తమమని ఔషధ రంగ నిపుణులు భావిస్తున్నారు.

## అమెరికా ఉత్పత్తులపై చైనా 84 శాతం సుంకం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

చైనా, అమెరికా దేశాలు పరస్పరం వస్తువులపై భారీగా సుంకాలు విధించుకుంటున్నాయి. చైనా నుంచి వచ్చే వస్తువులపై ట్రంప్ 104 శాతం సుంకం విధించిన నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై తాము 84 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా తాజాగా ప్రకటించింది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇటీవల చైనాపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని డ్రాగన్ కూడా నిర్ణయించింది. దీంతో ఆగ్రహించిన ట్రంప్, ఏప్రిల్ 8లోగా చైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. లేకుంటే అదనంగా మరో 50 శాతం ప్రతీకార సుంకం విధిస్తానని హెచ్చరించారు. ఇచ్చిన గడువులోగా చైనా స్పందించకపోవడం వల్ల తాను చెప్పినట్లుగానే గతంలో విధించిన 54 శాతానికి అదనంగా 50 శాతం జోడించారు. ఫలితంగా చైనాపై విధించిన సుంకాలు 104 శాతానికి చేరుకున్నాయి. దీంతో అమెరికా అహంకారంతో వ్యవహరిస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని చైనా ఆరోపించింది. ప్రతిగా మరో 50 శాతం సుంకాలను పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. ట్రంప్ వాణిజ్య చర్యలకు వ్యతిరేకంగా చివరి వరకు పోరాడుతామని పేర్కొంది.

సుంకాల పెంపుపై అమెరికాతో చర్చించడానికి ఇప్పటి వరకు చైనా ఆసక్తి చూపలేదు. కొన్ని దేశాలు అమెరికాతో చర్చలు జరపడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే అమెరికా గౌరవం, సమస్యలను పరిష్కరించుకునేందుకు సమాన సహకారం అందించేందుకు సంసిద్ధంగా లేకపోతే చర్చల ప్రసక్తే ఉండదని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

## తెలంగాణలో బీజేపీ ఇప్పటికే అడుగు పెట్టింది..

- ఎంపీ రఘునందన్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు తెలంగాణ బీజేపీ కీలక నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు కౌంటర్ ఇచ్చారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ ఆల్రెడీ అడుగు పెట్టింది.. ఇంకా రేవంత్ రెడ్డి అడుగుపెట్టనిచ్చేది ఏంటి? అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి లాస్ట్ ముఖ్యమంత్రి అని చెప్పారు. వచ్చే 20 ఏళ్లు కాంగ్రెస్‌కు తెలంగాణలో స్థానం లేదని అన్నారు.

## కులగణనపై బిల్లు తెస్తే ఆమోదిస్తాం

- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా కులగణన జరగాలని, దీనిపై పార్లమెంటులో బిల్లు తేవాలని రాహుల్ గాంధీ అన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే వెంటనే తమ ఆమోదం తెలిపుతామని చెప్పారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సదస్సు, సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ ఇదే విషయాన్ని పార్లమెంటులో మోదీ ముందు తాను ప్రస్తావించినట్టు చెప్పారు. "తెలంగాణలో విప్లవాత్మక అడుగు వేశాం. కులగణన జరిపాం. దీనికి కొద్ది నెలల ముందు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రధానిమంత్రి నరేంద్ర మోదీని పార్లమెంటులో అడిగాను. గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల వారికి దక్కాల్సిన నిజమైన వాటా దక్కుతోందా అనేది తెలుసుకోవాలని అనుకుంటున్నట్టు చెప్పాను. కానీ ప్రధాని కానీ, ఆర్ఎస్ఎస్ కానీ చాలా స్పష్టంగా కులగణనను వ్యతిరేకిస్తున్నాయి. మైనారిటీలకు దక్కుతున్న వాటా ఎంతో వెల్లడించేందుకు వారికి ఎంతమాత్రం ఇష్టం లేకపోవడమే ఇందుకు కారణం. పార్లమెంటులో వారికి చాలా స్పష్టంగా కూడా చెప్పాను. కులగణన బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే ఇప్పటికిప్పుడు తామంతా ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశాను" అని రాహుల్ అన్నారు. దేశ జనాబాలో 90 శాతం మంది జనాభాకు సరైన ప్రాతినిధ్యం లేదని, 90 శాతం అవకాశాలను ఇతరులు లాగేసుకుంటున్నారని రాహుల్ అన్నారు. కులగణనతో దేశంలో దళితులు, గిరిజనులు, ఓబీసీల సంఖ్య తెలుతుందన్నారు.

## దేశాన్ని మోడీ అమ్మేస్తారు


- కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున్ ఖర్గే



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఏదో ఒకరోజు ప్రధాని మోడీ దేశాన్ని అమ్మేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున్ ఖర్గే ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్షాలను మోసపూరితంగా ఓడించారని ఖర్గే మండిపడ్డారు. యావత్ ప్రపంచం ఈవీఎంల నుంచి బ్యాలెట్ పేపర్ వైపుగా మారుతుంటే, ఇంకా దేశంలో ఈవీఎంలను వినియోగిస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. ఈవీఎంలతో జరుగుతున్నదంతా మోసమేనని ఖర్గే వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు."బ్యాలెట్ పేపర్‌తో దేశంలో ఎన్నికలను నిర్వహించాలి. యావత్ దేశంలోని యువతరం గళమెత్తి మాకు బ్యాలెట్ పేపర్ కావాలి అని తప్పకుండా అంటారు. ఈవీఎంల గురించి మేం ప్రశ్నిస్తే, వాళ్లు నిరూపించమని అడుగుతారు. అధికార పార్టీకి లబ్ధి చేకూరేలా, విపక్ష పార్టీలకు నష్టం జరిగేలా వాళ్లు ఈవీఎంలలో మార్పులు చేయించుకున్నారు. మహారాష్ట్ర లాగే హరియాణాలో జరిగింది. ఓటర్ల జాబితాలను తప్పులతడకగా ఇష్టానుసారంగా తయారు చేస్తున్నారు. ఆశ్చర్యకరంగా మహారాష్ట్రలో బీజేపీకి 90 శాతం అసెంబ్లీ సీట్లు వచ్చాయి. గతంలో ఎన్నడూ ఆ పార్టీకి అన్ని సీట్లు రానే లేదు. ఇదంతా మోసం వల్లే సాధ్యమైంది. వాళ్లు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు. మేం తప్పకుండా నిజాన్ని బయటపెడతాం. దొంగ తప్పకుండా దొరుకుతాడు. మా న్యాయవాదులు, నాయకులు దానిపై పనిచేస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం" అని అన్నారు.

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి గ్రీన్‌సిగ్నల్




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

హైదరాబాద్ ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 161 కిలోమీటర్ల మేర సంగారెడ్డి-తూప్రాన్-గజ్వేల్-చౌటుప్పల్ వరకు ఆరు ప్యాకేజీల్లో నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి రూ. 7,104.06 కోట్లు మంజూరయ్యాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం టోల్ ప్లాజాలు, విశ్రాంతి గదులు, సర్వీస్ రోడ్లు, బస్ బేలు , ట్రక్ బేలతో పాటు మొత్తం 11 అత్యాధునిక ఇంటర్‌ఛేంజ్‌లను నిర్మించనున్నారు.

ప్రస్తుతం నగర చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు దాదాపు 40 కిలోమీటర్ల అవతల ఈ భారీ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ భాగాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టును ఉత్తర , దక్షిణ భాగాలుగా విభజించి నిర్మిస్తుండగా.. ఇప్పటికే ఉత్తర భాగానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి హోదాను మంజూరు చేసింది. ఇటీవల.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం రీజినల్ ఎంపవర్డ్ కమిటీ ఈ అనుమతులను జారీ చేసింది. దీనికి కొనసాగింపుగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ కూడా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి పూర్తి స్థాయి అనుమతులు మంజూరు చేస్తూ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే.. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పట్టణాలు, గ్రామాలు అభివృద్ధికి ఇది ఒక వరంలా మారనుంది.ప్రాంతీయ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణం మొత్తం ఐదు ప్రత్యేక ప్యాకేజీల ద్వారా చేపట్టనున్నారు. ప్రతిష్ఠాత్మక భారత్‌మాల పరియోజన కార్యక్రమంలో భాగంగా.. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ కీలకమైన రహదారిని నిర్మించనుంది. ఈ రహదారి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల గుండా వెళుతుంది. ఈ రహదారి డిజైన్‌ను రోడ్లు , భవనాల శాఖలోని నేషనల్ హైవేస్ డివిజన్ అందించిన ముఖ్యమైన సమాచారం, సిఫార్సుల ఆధారంగా రూపొందించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ రహదారిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో ఉత్తర భాగం పూర్తి బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే తీసుకోనుంది. ఉత్తర భాగాన్ని సంగారెడ్డి నుండి ప్రారంభించి.. తూప్రాన్, గజ్వేల్ మీదుగా చౌటుప్పల్ వరకు మొత్తం 161 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ భారీ రహదారిని మొత్తం ఆరు ప్రత్యేక ప్యాకేజీలలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్మాణం కోసం దాదాపు 1,940 హెక్టార్ల భూమి అవసరం అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. భూసేకరణ ప్రక్రియ కూడా వేగంగా జరుగుతోంది.

## వడ్డీ రేట్లు మరో పావు శాతం తగ్గింపు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో సారి వడ్డీ రేట్లను తగ్గించింది. మూడు రోజుల పాటు సాగిన మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్షలో రెపోరేటులో 0.25శాతం కోత పెట్టాలని నిర్ణయించామని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గనుందన్నారు. ఇంతక్రితం ఫిబ్రవరిలో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షలోనూ వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్బీఐ తాజా నిర్ణయంలో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చి తులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభా వం చూపించనున్నాయని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత జీడీపీపై సుంకాల ప్రభావంపై మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. భౌగోళికంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత వాణిజ్య యుద్ధ భయాలు, ముఖ్యంగా అమెరికా నుంచి సుంకాల పెంపు కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించవచ్చన్నారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గొచ్చన్నారు. ఇంతక్రితం అంచనాతో పోల్చితే 20 బేసిస్ పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. తొలి త్రైమాసికం (క్యూ1)లో 6.5శాతం, క్యూ2లో 6.7శాతం, మూడు, నాలుగు త్రైమాసికాల్లో వరుసగా 6.6శాతం, 6.3శాతంగా ఉండొచ్చన్నారు. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని.. ఇవి రాబోయే 11 నెలల దిగుమతులకు సరిపోతాయన్నారు.

## ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్‌లు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



భారత నావికాదళం కోసం 700కోట్ల డాలర్లు విలువ చేసే 26 రాఫెల్ మెరైన్ జెట్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఫ్రాన్స్‌తో ఒప్పందానికి భారత్ ఆమోద ముద్ర వేసింది. బుధవారం సమావేశ మైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ మేరకు నిర్ణయం తీసుకుందని అధికార వర్గాలు తెలి పాయి. ఈ ఒప్పందం కింద 26 రాఫెల్ విమానాలు భారత్‌కు అందుతాయి. వీటిలో 22 సింగిల్ సీటర్ జెట్‌లు కూడా వున్నాయి. విమాన వాహక నౌకల నుండి వీటిని నిర్వహించవచ్చు, మరో నాలుగు ట్విన్ సీటర్ జెట్‌లు వుంటాయి. రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ ఒప్పందానికి సీసీఎస్ ఆమోద ముద్రే తుది చర్య. ఈ నెలాఖరులో ఫ్రాన్స్ రక్షణ మంత్రి భారత్‌లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా లాంఛనంగా ఒప్పందం పై సంతకాలు జరుగుతాయని భావిస్తున్నారు. ఫ్రాన్స్ నుండే కొనుగోలు చేయాలని భావిస్తున్న మరో మూడు స్కార్పియన్ సాంప్రదాయ జలాంతర్గాములకు కూడా సీసీఎస్ ఆమోదం ఇంకా అందాల్సి వుంది. కాగా ఒప్పందంపై సంతకాలు అనంతరం రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను నాలుగేళ్ళలో ఫ్రాన్స్, భారత్‌కు అందచేయాల్సి వుం టుంది. భారత నావికా దళానికి చెందిన రెండు విమాన వాహక నౌకల నుండి రాఫెల్-ఎంలను నిర్వహిస్తారు. 2016 సెప్టెంబరు రూ.60వేల కోట్లతో కుదిరిన ఒప్పందంలో భాగంగా భారత వైమానిక దళానికి 36 రాఫెల్ జెట్‌లు అందాయి. 2023 జులై 13న ప్రధాని పారిస్‌కు వెళుతున్న సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశం ఈ ఒప్పందం ఆవశ్యకతను గుర్తించింది.

పంజాబ్, హర్యానాలోని 19.2కిలో మీటర్ల జిరక్‌పూర్ బైపాస్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.1878.31కోట్లు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఆరు లైన్లలో ప్రధాన మంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకెఎస్‌వై) ఉప పథకంగా 2025-26 కాలానికి రూ.1600 కోట్ల తొలి కేటాయింపులతో ఇరిగేషన్ నెట్‌వర్క్ ఆధునీకరణను చేపట్టనున్నారు. నిర్దేశిత క్లస్టర్‌లో ప్రస్తుతమున్న కాలవల నుంచి లేదా ఇతర వనరుల నుంచి సాగునీటి సరఫరా కోసం నెట్‌వర్క్‌ను ఆధునీకరించడమే ఈ పథకం లక్ష్యంగా వుంది. దీనికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీంతో పాటు తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి వివరించారు.

## అయోధ్య రామదర్బార్‌లో జూన్ 6 నుంచి భక్తులకు ప్రవేశం

**బలగం టీవి, హైదరాబాద్**

అయోధ్యలోని రామాలయంలో జూన్ 6 నుంచి రామ్‌దర్బార్ భక్తులకు అందుబాటు లోకి రానున్నదని ఆలయ నిర్మాణ కమిటీ చీఫ్ నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. అయితే దీని ప్రారంభోత్సవం కోసం ప్రత్యేక కార్యక్రమాన్నినిర్వహించడం లేదని చెప్పారు. ఈ ప్రక్రియతో అయోధ్య రామాలయ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. 2020 లో అయోధ్య రామాలయ నిర్మాణం ప్రారంభం కాగా, 2024లో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగింది. ఇంతవరకు రామ్‌లల్లాగా పూజలందుకుంటున్న విగ్రహాన్ని రాజారాంగా రామ్ దర్బార్‌లో ప్రతిష్ఠించనున్నట్టు నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో నిర్మిస్తున్న దర్బార్‌లో రాజారామ్‌ను ప్రతిష్ఠిస్తారు. మే 23న జరిగే కార్యక్రమంలో రాముడు, సీత, రాముడి సోదరుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారని మిశ్రా వెల్లడించారు. రామ్ దర్బార్ లోకి భక్తులకు ప్రవేశం కల్పించడానికి ముందు రకరకాల పూజలు జరుగుతాయని, జూన్ 5న అవి పూర్తవుతాయని జూన్ 6 నుంచి భక్తులకు ప్రవేశం ఉంటుందని చెప్పారు.

## 16 నుంచి గ్రూప్-1 సర్టిఫికెట్ వెరిఫికేషన్

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో గ్రూప్–1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. ఏప్రిల్ 16, 17, 19, 21 తేదీల్లో నాంపల్లిలోని సురవరం ప్రతాప్ రెడ్డి యూనివర్సిటీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని వెల్లడించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు ఎంపికైన అభ్యర్థుల జాబితా తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని టీజీపీఎస్సీ తెలిపింది. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ కు హాజరు కావాలని సూచించారు.

## పెంచిన పెట్రో, గ్యాస్ ధరలను వెనక్కి తీసుకోవాలి..

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవి, హైదరాబాద్**

పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోడీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై కేంద్ర పెట్రోలియం,సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్‌పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.

ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు.గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్లు పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం "మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్"గా మారిందని విమర్శించారు.

మోడీ చెప్పిన "అచ్చే దిన్" అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా? సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ పశ్నించారు. దేశంలోని కోట్లాది ప్రజల తరపున రాసిన ఈ లేఖలో, ప్రజల తరపున కొన్ని డిమాండ్లను కేంద్రమంత్రి ముందు కేటీఆర్ ఉంచారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలన్నారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు. దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సమయం కేంద్రప్రభుత్వానికి వచ్చిందన్నారు కేటీఆర్. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మాని, అసలైన పని చేయాలని కేటీఆర్ ఊచించారు.

# ఫాం హౌస్‌లో ముజ్రా పార్టీ భగ్నం

- **ఫార్మ్‌హౌస్‌లో పార్టీ పేరుతో అశ్లీలంగా డ్యాన్సు లు...**
- **70 గ్రాముల గంజాయి స్వాధీనం**

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముజ్రా పార్టీని పోలీసులు భగ్నం చేశారు. బుధవారం తెల్ల వారుజామున ఎస్వోటీ పోలీసుల దాడి చేసి ముజ్రా పార్టీ భగ్నం చేసి, కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఏత్‌బార్‌పల్లి గ్రామ రెవెన్యూలో హాలిడే ఫార్మ్‌హౌస్‌లో పార్టీ పేరుతో అశ్లీలంగా డ్యాన్సులు చేస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం తెల్లవారుజామున సుమారు 3.30 లకు ఎస్వోటీ పోలీసుల దాడి చేశారు. ముజ్రా పార్టీని భగ్నం చేసిన ఎస్వోటీ పోలీసులు ఏడుగురు యువతులు, 14 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని స్థానిక మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. ఒకరి పుట్టినరోజు సందర్భంగా పార్టీ ఏర్పాటు చేశారని సమాచారం. అయితే పోలీసులు ఆ ఫాం హౌస్‌లో పెద్ద ఎత్తున మద్యం, 70 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.పార్టీలో యువతులు సైతం పెద్ద ఎత్తున పాల్గొనడంతో ముజ్రా పార్టీ అని పోలీసులు అనుమానిస్తున్నారు.

నిర్వాహకులు ఈ బర్త్‌డే పార్టీ కోసం పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చారని ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు పార్టీ నిర్వాహకులు, ఫాంహౌస్ యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అరెస్టయిన యువకులంతా పాతబస్తీకి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం సేకరించే దిశగా పోలీసుల ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవలి కాలంలో పలు ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయన్న ఆరోపణలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పోలీసు నిఘాను ముమ్మరం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దింపారు. సమాచారం వచ్చిన వెంటనే ఆయా బృందాలు రంగంలోకి దిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ రకమైన ముజ్రా పార్టీలు, డ్రగ్స్ అవకాశమిచ్చే విధంగా చర్యలను ఎన్నటికీ ప్రోత్సహించజాలమని పోలీసు అధికారులు తెగేసి చెబుతున్నారు. మరో వైపు పార్టీ నిర్వాహకుడిని సైతం పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది.

ముజ్రాపార్టీలో భాగంగా మద్యం, హుక్కా, గంజాయి స్వాధీనం చేసుకున్నామని, అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, హాలీడే ఫాంహౌస్‌లో అబ్దుల్ లుక్మాన్ అనే వ్యక్తి బర్త్‌డే పార్టీ నిర్వహించారని, ఈ ముసుగులో ముజ్రా పార్టీ నిర్వహించారని మెయినాబాద్ పోలీసులు పేర్కొంటున్నారు. సింగర్లు రీనా, బాబు అధ్వర్యంలో ఈ పార్టీ నిర్వహించినట్లుగా పోలీసులు తెలిపారు. రీనా కోల్‌కతాకు చెందిన మహిళగా, గత ఐదు సంవత్సరాలుగా నగరంలో ఉంటూ పార్టీలలో పాటలు పాడుతున్నారన్నారు. గతంలో ఇలాంటి పార్టీలలో రీనా పట్టుబడిందని పోలీసులు వెల్లడించారు.

## హనుమాన్ విజయ యాత్రకు భారీ బందోబస్తు

- **హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్**




**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో ఈ శనివారం జరిగే వీర హనుమాన్ విజయ యాత్రకు పూర్తి భద్రతా ఏర్పాట్లు చేస్తామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వాహకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో హైదరాబాద్ నగర పోలీసులు బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహించాలని కోరారు. విజయ యాత్ర సందర్భంలో ఎవరైనా కొత్త వారు వచ్చి చేరితే, వారిపై దష్టి సారించడంతోపాటు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరేగింపు సమయంలో నిర్వాహకులు సంయమనంతో ట్రాఫిక్ జామ్ కాకుండా, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. నిర్వాహకులు విగ్రహాల ఎత్తులో ముందే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా రైల్వే బ్రిడ్జ కన్నా ఎక్కువ ఎత్తు విగ్రహాలు పెట్టినచో వారిని వేరే మార్గం ద్వారా పంపిస్తామన్నారు. నిర్వాహకులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఊరేగింపులో డీజే సిస్టమ్‌లను ఉపయోగించకపోవడమే మేలన్నారు. నిర్వాహకులు రోప్ పార్టీ సభ్యులకు(వాలంటీర్లకు) సరైన శిక్షణ ఇచ్చి వారిని వినియోగించుకోవాలని తెలిపారు. వాలంటీర్లను ఎక్కువ సంఖ్యలో పెట్టుకోవాలని సూచించారు. నిర్దేశించిన రూట్ లోనే వెళ్ళితే ఎలాంటి సమస్యలు తలెత్తదన్నారు. గత అనుభవాలను దష్టిలో ఉంచుకుని విజయయాత్ర ముగిసిన తరువాత, తిరుగు ప్రయాణంలో సైతం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు శాఖ ముందస్తు అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించరాదన్నారు. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సుమారు 150 విజయ యాత్రలు తీస్తుండగా, సైబరాబాదు, రాచకొండ పరిధిలో 46 విజయ యాత్రలు తీస్తున్నారని, ఇవన్నీ ప్రధాన యాత్రలో కలుస్తాయని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని, రెచ్చగొట్టే పోస్ట్‌లు పెట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ సీపీ జోయల్ డెవీస్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

నగరంలో విజయ యాత్రకు 17000 మంది పోలీసులు

హైదరాబాద్‌లో ప్రధాన విజయ యాత్ర ఊరేగింపు రామ మందిరం గౌలి గూడ నుంచి ప్రారంభమై నారాయణ గూడా, ఆర్.టి.సి చౌరస్తా, అశోక్ నగర్, కవాడి గూడా, బైబిల్ హౌస్ నుంచి తాడ్ బండ్ హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 12.2 కిలోమీటర్లు జరగనుంది. ఈ మార్గాన్ని అధికారులు పరిశీలించారు. విజయ యాత్రకు హైదరాబాదు సిటీ పోలీసు తరపున 17000 మంది పోలీసులతోపాటు అదనంగా సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు



**మాజీ మంత్రి హరీశ్‌రావు**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డి పాలనతో ప్రజలు విసుగు చెందుతున్నారని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి పాదయాత్ర అనంతరం సిద్ధి వినాయక దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలన సగం సగం ఆగమాగం. ఏది చూసినా సగం సగం అంతా ఆగమాగం. మూసీ మూసీ అన్నాడు మూడున్నర నెలలకే ఎల్లేలుకల పడ్డడు. హైడ్రా హైడ్రా అని ఆర్నెల్లు ఉరికిండు వెల్లకిలబడ్డాడు. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదు. రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఈగలు కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. కాంపౌండ్‌లో గిరాకి లేదు, రిజిస్ట్రేషన్ ఆఫీసులకు ఆదాయం లేదు. కెసిఆర్ పాలనలో రియల్ ఎస్టేట్ పెరుగుడే పెరుగుడు.. రేవంత్ రెడ్డి పాలనలో దిగుడే దిగుడు. ఏమన్నంటే ఆర్ఆర్ టాక్స్. మెట్రో రైల్ వద్దన్నాడు, ఫార్మాసిటీ వద్దన్నాడు అని పేర్కొన్నారు.ఎటువంటి తెలంగాణను రేవంత్ రెడ్డి ఎట్లా చేస్తున్నాడు. పటాన్‌చెరు ఇండస్ట్రియల్ ఏరియాలో వారానికి రెండు రోజులు పవర్ హాలిడే వచ్చేది. కేసీఆర్ వచ్చాక పవర్ హాలిడేలు ఎత్తేసి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చాడు. దేశానికి నెంబర్ వన్‌గా తెలంగాణ తీర్చిదిద్దింది కేసీఆర్. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు తెలంగాణ నుండి బియ్యాన్ని మాకు అమ్మండి అని అడిగేవారు" అని తెలిపారు.

## 11న అపెరల్ పార్క్‌లో యూనిట్ ప్రారంభం..



**-హాజరుకానున్న నలుగురు మంత్రులు**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో టెక్స్ పోర్ట్ యూనిట్ ను రాష్ట్ర మంత్రులు నెల 11న ప్రారంభించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా అపెరల్ పార్క్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ శుక్రవారం జిల్లా ఇన్చార్జి మంత్రి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాకు రానున్నట్లు తెలిపారు.

ఆయా శాఖల మంత్రులు పార్కులోనే టెక్స్ పోర్ట్ యూనిట్ ను ప్రారంభిస్తారని వెల్లడించారు. మంత్రుల రాక సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రారంభమనంతరం సభ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కావాల్సిన ఏర్పాట్లను రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ శాఖ వారు బందోబస్తు ఇతర పనులను చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల నాయబ్ తహశీల్దార్ విజయ్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల మానేరు వాగులో చెక్ డ్యాం పునర్నిర్మించాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,సిరిసిల్ల**

సిరిసిల్ల మానేరు వాగులో దెబ్బతిన్న చెక్ డ్యాంను పునర్నిర్మించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారలను ఆదేశించారు. సిరిసిల్ల పట్టణ సమీపంలోని మానేరు వాగులో సాయిబాబా ఆలయం సమీపంలో దెబ్బతిన్న చెక్ డ్యాంను కలెక్టర్, ఈఎన్ సీ శంకర్ తో కలిసి బుధవారం పరిశీలించారు. వెంటనే పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. మానేరు బ్రిడ్జి నుంచి సాయి బాబా ఆలయం వరకు మూడు కిలోమీటర్ల పొడవు కరకట్ట పునర్నిర్మాణాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ.ఈ.లు అమరేందర్ రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పంట చివరి గింజ వరకూ కొంటాం

**-248 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం...**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..**



**బలగం టీవీ,వేములవాడ:**

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని సరైన మద్దతు ధరకు విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.బుధవారం వేములవాడ పట్టణ పరిధిలో బాల నగర్, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, మల్లారం లో ప్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ,అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని అన్నారు.సి ఎం రేవంత్ రెడ్డి మహిళా తల్లులను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కొనుగులు కేంద్రాలను వారికి కేటాయించారని అన్నారు. సి ఎం రేవంత్ రెడ్డి రైతులకు పెద్ద పీట వేస్తున్నారని,రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు,మేలైన వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామని అన్నరు. రైతులకు ఏక కాలంలో రైతు ప్రయోజనాలు కోసం 21 వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు.సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్ కు అదనంగా రూ. 500 ఇస్తున్నదని అన్నారు.పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, కలెక్టర్, అధికార యంత్రాంగం కొనుగోలు కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని,రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా అదనపు సెంటర్లు ఏర్పాటు చేస్తామని,ప్రజా ప్రభుత్వంలో నష్టపోయిన రైతులకుతెలిపారు రూ.10,000 పరిహారం చెల్లించామని అన్నారు. జిల్లాలో 248 సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా జిల్లా లో ఇప్పటి వరకు 35 సెంటర్లు ప్రారంభించామని అన్నారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలని, సరిపడా టార్పలిన్ కవర్లు, గన్ని సంచులు,ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, జిల్లా మేనేజర్ రజిత,జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెట్ కమిటీ, ప్యాక్స్ చైర్మెన్ లు రోండి రాజు, ఏనుగు తిరుపతి రెడ్డి వైస్ చైర్మన్

## అంకిత భావంతో విధులు నిర్వహించాలి

**టీజిఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్**




**బలగం టీవీ, సిరిసిల్ల**

బెటాలియన్ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలని టీజిఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ పోలీస్ బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన ఆయుధకారగారంను వర్చువల్ పద్ధతి ద్వారా టీజిఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజేపీ సంజయ్ కుమార్ జైన్ , ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ కు వచ్చిన డిఐజి సన్నీ కమాండెంట్ సురేష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.అనంతరం బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన దోభీ మరియు బార్బర్ రూమ్ లను రిబ్బన్ కట్ చేసి. డిఐజి సన్నీ ప్రారంబించారు ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ బెటాలియన్ అధికారుల,సిబ్బంది సమస్యలను యోగక్షేమాలను అడిగి తెలుసుకుని అంకిత భావంతో విధులు నిర్వహించాలని అన్నారు.తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ క్రమశిక్షణ కలిగిన ఆర్గనైజేషన్ అని, బెటాలియన్ అభివృద్ధిలో అధికారులు మరియు సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. డిఐజి సన్నీ బెటాలియన్ అధికారులు మరియు సిబ్బందిని ప్రశంసించారు. బెటాలియన్ కమాండెంట్ ఎమ్. ఐ సురేష్ మాట్లాడుతూ అడిషనల్ డిజిపి సూచించినటువంటి అన్ని సలహాలు సూచనలను తప్పకుండా పాటిస్తా మని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమ నిధి నుంచి ప్రైవేట్ ఏజెన్సీలు దోపిడి

**గురజాల శ్రీధర్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



లేబర్ కార్డు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ చెకప్ రక్త పరీక్ష పేరిట గ్రామాలలో వైద్య బృందాన్ని నిలిపివేయాలని భవన నిర్మాణ రంగం సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వేములవాడ పట్టణంలో బుధవారం కార్మికులకు చేపట్టిన వైద్య పరీక్షలను వారు అడ్డుకున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత కొన్ని నెలల నుంచి భవన నిర్మాణ లేబర్ కార్డు ఉన్న కార్మికులకు వైద్య రక్తపరీక్షల పేరిట వైద్య బృందం గ్రామాల్లో తిరుగుతూ కార్మికులను అనేక రకాలుగా మసి పూసి మారేడు కాయ మాటలు చెప్పి మీరు రక్త పరీక్షలు చేసుకోవాలని, ఫోన్లు చేసి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డులో కార్మికుల సంక్షేమానికి వినియోగించవలసిన నిధులను ఈ రకంగా రక్త పరీక్షల పేరిట ఒక్కొక్క కార్మికునికి పరీక్షలు జరిపి దాదాపు 3500 రూపాయలు ఖర్చు చూపించి, కార్మికులకు హెల్త్ చెకప్ చేసామనీ చెప్పి కార్మికుల నిధులను బిల్లుల రూపకంగా పే చేసుకొని పక్కదారి పట్టిస్తున్నారనీ అన్నారు. ఈ ప్రభుత్వాలు కార్మికులకు చెందాల్సిన నిధులను రాష్ట్ర లేబర్ డిపార్ట్మెంట్ కొన్ని హెల్త్ సంస్థలతో కుమ్మక్కై ఈ రకంగా కార్మికులను మోసం చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సంక్షేమ బెనిఫిట్ పెంచాల్సింది పోయి ఉన్న నిధులను కాజేయడానికి ఇలా అడ్డదారిలో కార్మికునికి రక్త పరీక్షలు పేరిట దోపిడీ చేస్తున్నారని. దీన్ని పూర్తిగా రాజన్న సిరిసిల్ల జిల్లా భవన నిర్మాణ రంగం సంఘం సిఐటియు తీవ్రంగా తప్పుపడుతుందనీ అన్నారు. బేషరతుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వైద్య పరీక్షల పేరిట గ్రామాల్లో వైద్య బృందం ఇప్పటికైనా మానుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## బార్య భర్తల మధ్య వివాదాల పరిష్కారం కోసం ఫ్యామిలీ కౌన్సిలింగ్..

**బలగం టీవీ, సిరిసిల్ల**

చిన్న చిన్న మనస్పర్థలే భార్యాభర్తల మధ్య వివాదాలకు కారణమని,ఒకరిపై ఒకరికి గల అపనమ్మకం మూలంగానే వివాదాలు పెద్దగా మారుతున్నాయని ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ అన్నారు.బుధవారం ప్రభుత్వ సాధారణ వైద్యశాలలోని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్ లో కార్మికులకు ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ మనోవికాస సదస్సును నిర్వహించినారు.ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య వివాదాల పరిష్కారం కోసం మైండ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం కలహాల కాపురాలుగా, మనశ్శాంతి కరువై అనేక దురలవాట్లకు నెలవు అవుతున్నాయని అన్నారు.

సానుకూల దృక్పథంతో ఒకరినొకరు అర్థం చేసుకుంటే వివాదాలకు తావే ఉండదని అన్నారు. నేటి ఆధునిక యుగంలో అనేక ఆర్థిక, సామాజిక పరమైన ఒత్తిళ్లు వ్యక్తుల మధ్య అవగాహన రాహిత్యానికి కారణమై అన్యోన్యతలు, ప్రేమాను బంధాలకు దూరం చేస్తున్నాయని అన్నారు. తీవ్ర మానసిక ఒత్తిడిలో తప్పుడు నిర్ణయాలు తీసుకొని విడాకుల వరకు వెళుతున్నారని అన్నారు. నేడు వ్యక్తుల్లో ఇగో సెంట్రిజం ఎక్కువై అనేక అపార్థాలకు కలతలు, కారణమవుతున్నదని అన్నారు.అహం వీడి ఒకరినొకరు అర్థం చేసుకొంటే ఎలాంటి మనస్పర్థలు రావని,ప్రతిరోజూ మైండ్ కేర్ సెంటర్ ద్వారా కార్మికులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది కొండ ఉమ, వేముల అన్నపూర్ణ, రాపెల్లి లత, బూర శ్రీమతి, కిమ్స్ కళాశాల విద్యార్థులు జి.పద్మ , జి.పూజిత, వి. సుస్మిత, నాగుల వందన, జె. అనుపమ అంజనీ, డి. మానస మరియు కార్మికులు పాల్గొన్నారు.

## రామాలయంలో రామన్న పూజలు..

**మల్కాపేట సీతారామ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న కేటీఆర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం కోనరావుపేట మండలంలోని మల్కపేట సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా మల్కాపేట వాస్తవ్యులు చల్మెడ ఆనందరావు, వారి కుటుంబ సభ్యులు సమక్షంలో ప్రతిష్టించబడిన శ్రీ సీతారామచంద్ర హనుమ సమేత రామాలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల వేడుకలలో కేటీఆర్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావులు మండల నాయకులతో కలిసి పాల్గొన్నారు.

## ప్రభాస్ ఫ్యాన్స్ ఓపికతో ఉండండి..

- దర్శకుడు మారుతి

**బలగం టీవి, హైదరాబాద్**




మారుతి దర్శకత్వంలోప్రభాస్ నటిస్తున్న చిత్రం రాజాసాబ్. అయితే ఈ మూవీ అంతకంతకూ ఆలస్యం అవుతూనే ఉంది. ఇదొక హారర్, కామెడీ సినిమా కావడంతో వీఎఫ్ఎక్స్ వర్క్ చాలా ఉందని అంటున్నారు. తాజాగా డార్లింగ్ ఫ్యాన్స్ రాజా సాబ్ సినిమా అప్డేట్ కోసం రిక్వెస్ట్ చేయగా మారుతి స్పందించారు.

"వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి.. ఇంకా ఆ కంపెనీల నుంచి అవుట్ పుట్ రాలేదు.. సినిమా అంటే ఏ ఒక్కరి పనో కాదు.. అందరు కలెక్టివ్‌గా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.. సరైన టైం కుదిరితే మూవీ నుండి అన్ని అప్‌డేట్స్ వస్తాయి.. అప్పటి వరకు కాస్త ఓపికతో ఉండండి.. సహనం వహించండి" అంటూ మారుతి ట్వీట్ వేశాడు. "సీజీ వర్క్స్ కంప్లీట్ అయితే నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ "రాజా సాబ్" సినిమా విడుదల తేదీని ప్రకటిస్తుంది. చిత్రం కోసం మేము పడిన కష్టాన్ని, మా ప్యాషన్ ను వీలైనంత త్వరగా మీకు చూపించాలని కోరుకుంటున్నాము" అని మారుతి తెలిపారు.

## కోలుకుంటున్న పవన్ కుమారుడు మార్క్ శంకర్..

**బలగం టీవి, హైదరాబాద్**



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ కోలుకుంటున్నాడు. సింగపూర్‌లోని స్కూల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అప్పటికప్పుడు సింగపూర్‌కి బయలుదేరి వెళ్లగా.. పవన్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ కూడా మార్క్‌ని చూడడానికి వెళ్లారు. అయితే తాజాగా మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు ఫొటోను విడుదల చేశారు కుటుంబసభ్యులు. ఈ ఫొటోలో మార్క్ విజయానికి సంకేతం చూపిస్తున్నట్లుగా పోజ్ ఇచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## ఇది ఆస్తి గొడవ కాదు

- నటుడు మంచు మనోజ్
- నటుడు మోహన్‌బాబు ఇంటి ముందు ధర్నా

**బలగం టీవి, హైదరాబాద్**



ఫ్యామిలీ గొడవలతో మోహన్‌బాబు కుటుంబం మరోసారి వార్తల్లో నిలిచింది. జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్దకు చేరుకున్న మంచు మనోజ్ గేటు బయట బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంచు మనోజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లో పెట్టేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఇంట్లో తన పెంపుడు జంతువులు, వస్తువులు ఉన్నాయని, వాటి కోసమే ఇక్కడికి వచ్చానని తెలిపారు. తనకు ఈ ఆస్తి వద్దని ఎప్పుడో తండ్రికి చెప్పానని, ఇది ఆస్తి గొడవ కాదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా అన్నారు. అక్కడే ఈ గొడవ మొదలైందని తెలిపారు. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఛార్జ్‌షీట్ నమోదు చేయలేదని మనోజ్ వాపోయారు. ఇక ఈ నెల 1న పాప పుట్టినరోజు సందర్భంగా రాజస్థాన్ కు వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారని ఆరోపించారు. తెల్లవారుజామున విష్ణు అనుచరులు వచ్చి కార్లను తీసుకెళ్లడంతో పాటు తన సెక్యూరిటీపై దాడి చేశారని మనోజ్ తెలిపారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారని, దొంగతనం గురించి చెప్పినా పోలీసులు ఎలాంటి యాక్షన్ తీసుకోవడం లేదన్నారు. ఇప్పుడు తన ఇంట్లోకి తాను వెళ్లడానికి అనుమతి కావాలని పోలీసులు అడుగుతున్నారని, మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తామంటున్నారని మనోజ్ తెలిపారు. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలికి పంపించడం లేదని, తన సమస్యను పరిష్కరించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి మనోజ్ విజ్ఞప్తి చేశారు. ఇక కన్నప్ప సినిమాకి పోటీగా తాను నటించిన 'భైరవం' చిత్రాన్ని వదులుదాం అనుకున్నామన్నారు. కానీ కన్నప్పని పోస్ట్ పోన్ చేసుకున్నాడన్నారు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇలా డైవర్షన్ చేస్తున్నాడని తెలిపారు. తాను వాళ్ల సినిమాలకు పని చేసి నప్పుడు ఎన్నడూ రూపాయి తీసుకోలేదని చెప్పారు. విష్ణు కెరీర్‌ను నిలబెట్టడానికి తనతో ఆడ గెటప్ వేయించారన్నారు. స్టంట్స్, సాంగ్స్, గ్రాఫిక్స్.. ఇలా వాళ్ల కోసం గొడ్డు చాకిరీ చేశానని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ విజయం

- 58 పరుగుల తేడాతో గెలుపు
- మరో సారి హాఫ్ సెంచరీతో సత్తా చాటిన సాయి సుదర్శన్



**బలగం టీవి, హైదరాబాద్**

రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 58 పరుగుల తేడాతో గెలుపొందింది. ప్రసిధ్ కృష్ణ(3/24) తీన్మార్ బౌలింగ్‌తో రాజస్థాన్ రాయల్స్ పతనాన్ని శాసించాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 217 పరుగులు చేసింది.సాయి సుదర్శన్(53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 82) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. జోస్ బట్లర్(25 బంతుల్లో 5 ఫోర్లతో 36), షారూఖ్ ఖాన్(20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36), రాహుల్ తెవాటియా(12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24 నాటౌట్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే(2/53), మహీష్ తీక్షణ(2/54)రెండేసి వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్(1/30), సందీప్ శర్మ(1/41) చెరో వికెట్ పడగొట్టారు.



అనంతరం రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. సంజూ శాంసన్(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41), షిమ్రాన్ హెట్‌మైర్(32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52) మినహా అంతా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/24) మూడు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, అర్షద్ ఖాన్, కుల్వంత్ ఖేజ్రోలియా తలో వికెట్ తీసారు. రషీద్ ఖాన్(2/37), సాయి కిషోర్(2/20)లకు రెండేసి వికెట్లు దక్కాయి. సంజూ శాంసన్ వికెట్ ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడం కూడా రాజస్థాన్ రాయల్స్‌కు నష్టం చేసింది.

## జూన్ 27న కన్నప్ప విడుదల

### రిలీజ్ డేట్.. ప్రకటించిన యూపీ సీఎం యోగి



**బలగం టీవి, హైదరాబాద్**

మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం కన్నప్ప. ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. . హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ మూవీ విడుదల తేదీని మళ్లీ ప్రకటించారు మేకర్స్. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను బుధవారం కలిసిన కన్నప్ప టీం.. యోగి చేతుల మీదుగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ మూవీని జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం సీఎం యోగి మూవీ యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## 'ఓదెల-2' ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**



తమన్నా నటిస్తున్న సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల-2'. ఇందులో ఆమె నాగసాధువు భైరవి పాత్రలో కనిపించనుంది. అశోక్‌తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అగ్ర దర్శకుడు సంపత్‌నంది క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనే కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలందించారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ముంబయిలో జరిగిన ఈవెంట్‌లో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ దుష్టశక్తి నుంచి ఓదెల గ్రామానికి పొంచి ఉన్న ముప్పు గురించి తెలుసుకున్న అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతారు. తమ జీవితాలను చీకటి కబళించబోతున్నదని ఆవేదన చెందుతారు. అలాంటి సమయంలో వారిని రక్షించడానికి నాగసాధువు గ్రామంలోకి ప్రవేశిస్తుంది. చెడుని ఎదుర్కోవాలని ప్రతిజ్ఞ చేస్తుంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా, యువ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్ వర్క్స్, దర్శకత్వం: అశోక్‌తేజ.

## సినీ నటుడు సప్తగిరికి మాతృ వియోగం

**బలగం టీవి, హైదరాబాద్**



సినీ నటుడు సప్తగిరి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. సప్తగిరి తల్లి చిట్టెమ్మ తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న చిట్టెమ్మ బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు.




## ముచ్చటగా బంధాలే.. పాట విడుదల

- సన్నాఫ్ వైజయంతి సినిమా నుంచి ..

**బలగం టీవి, హైదరాబాద్**

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ సన్నాఫ్ వైజయంతి. ఇందులో విజయశాంతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇందులో వీరిద్దరూ తల్లి, కొడుకులుగా కనిపిస్తున్న సంగతి తెలిసిందే. సాయి మంజ్రేకర్ హీరోయిన్. కొత్త డైరెక్టర్ ప్రదీప్ చిలుకూరి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా సాంగ్ రిలీజ్ చేశారు. ముచ్చటగా బంధాలే అంటూ తల్లి, కొడుకుల మధ్య ప్రేమను చూపిస్తూ ఆ సాంగ్ ఉంది. ఇందులో తల్లిని హీరో ఎంత బాగా చూసుకుంటాడు అనేది చూపించారు. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా ఉన్న వైజయంతికి కొడుకు ఇంట్లో పనులు, సేవలు చేస్తూ ఉండటం ఇందులో మనకు కనిపిస్తోంది. సెట్స్ అన్నీ రిచ్ గానే కనిపిస్తున్నాయి. విజువల్స్ కూడా చాలా స్టైలిష్ గా తీర్చిదిద్దారు.

అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తుండగా.. హరిచరణ్ ఈ సాంగ్ పాడారు. రఘురామ్ లిరిక్స్ రాశారు. ఈ నెల 18న వస్తున్న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది.